# కోరిక

## ఇంగువ అన్నపూర్ణ

ఆడపిల్లని అప్పగింతలు పెట్టి అత్తవారింటికి పంపేసిన తర్వాత, ఊళ్ళో చుట్టాలు ఇళ్ళదారి పట్టే, మిగిలిన కొద్దిమంది తెల్లవారుజామున బయల్దేరి ఇళ్ళకు వెళ్ళే సన్నాహాలు చేసుకుని తలొక మూలా ఆ హాలులో నడుములు వాల్చేశారు ఇష్షు అష్షు అని ఆయాసపడిపోతూ. అప్పటికి మూడొంతులు ముసురు వదిలి తెరిపి ఇచ్చింది ప్రాణానికి అనుకున్నాడు పెళ్ళికూతురు తండ్రి ఆనందరావు. ఇదే ఆ ఇంట్లో జరిగిన ఆఖరి శుభకార్యం. అందుకే ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోదామని అతని ప్రయత్నం. అంతలోనే వచ్చింది అతని అర్ధాంగి కృష్ణవేణి.

"అప్పుడే పడుకుంటున్నావా?"

"ఇంకే చెయ్యమన్నావు?" నాలుగ్గజాల దూరంలో నడుం వాల్చిన పెద్దల్లుడికి మామగారి చమత్కారానికి నవ్వు వచ్చింది.

"అమ్మాయిని కాపురానికి పంపటానికి తేవాల్సిన సారె వగైరా లిస్టు రాశాను ఇంకేమన్నా చేర్చాలేమో చూడండి"

"రేపు చూద్దాంలే పడుకో" చేయి పట్టి లాగాడు ప్రక్కనే చోటు చూపిస్తూ.

**పెళ్ళయిన కొత్తలో కృష్ణవేణి, ఆనందరావు మొక్కు తీర్చుకోటానికి తిరుపతి వెళ్ళి అక్కడి హోటల్లో దిగినప్పుడు, ఆ హోటలు గదిలో మెత్తటి ఫోమ్ పరుపు మీద పడుకున్నప్పుడు, ఆ హాయి పులకరింపజేస్తుంటే అడిగింది**

"సరేలే సంబరం... వాద్దున్న తిరుబాటుగా చెప్పటానికి కుదరదు. ముందు చూడండి"

లిస్టు అంతా చదివాడు ఆనందరావు. అన్నీ ఓకే చేశాక ఆఖరున మరొకటి అతను రాశాడు. వేలితో అది చూపుతూ "ఇదెందుకిప్పుడు. మనకి ఆచారం లేదు ఇవ్వటం" అన్నది కృష్ణవేణి.

"మన కోసం" ఆవిడ అటుఇటు చూసింది ఎవరైనా గమనిస్తున్నారేమోనని. తర్వాత చురుగ్గా చూసింది అతనివైపు.

"మీకెప్పుడే ఖర్చు ముఖ్యమో కూడా తెలీదు... ఇప్పుడు వద్దు. తర్వాత చూద్దాం"

"తెలుసు. ఇది నువ్వు కాపురానికి వచ్చినప్పుడు అడిగిన ఒకేఒక్క కోరిక. ఇన్నేళ్ళయినా తీర్చలేకపోయాను. ఈ రోజుతో అన్ని బాధ్యతలు తీరిపోయాయి... ఎలాగూ ఖర్చు తప్పదు... ఖర్చులో ఖర్చు కలిసొస్తుంది. అన్ని ఖర్చులు పోను చేతిలో రెండు వేలు మిగుల్తాయి ఎంత లేదన్నా. నువ్వేం వర్రీ అవకు ఖర్చు గురించి. నేను మేనేజ్ చేస్తాగా"

అసలే ఆడపిల్ల పెళ్ళి చేసి ఖర్చులో మునిగివుంటే ఇప్పుడేనా ఈ ఖర్చు కూడా. ఆ మనిషికి ఎంత తోస్తే అంతే. తను ఇంక ఎంత చెప్పినా వినరు. మళ్ళీ అనిపిస్తుంది ఇదంతా తన మీద ప్రేమతోటే కదా చేసేది అని. సంతోషంగా కూడా వుంది. ఇన్నేళ్ళ కాపురంలో అన్ని బాధ్యతలే చూశారు కానీ ఇద్దరికీ ఏ కోరికా తీర్చుకోటం మటుకు చాతకాలేదు. మధ్యతరగతి కొంపల్లో కోరికలెక్కువా తీరే మార్గాలు తక్కువ.

* * *

పెళ్లికూతురికి ఆ రాత్రి కోసం మల్లెపూల జడవేస్తూ చుట్టూ చేరిన జనాలకి గిలిగింతలు పెట్టే కబుర్లు చెప్తోంది సుందరమ్మ. ఆవిడ అందరికీ దొడ్డమ్మే.

"అప్పుడేమయింది దొడ్డమ్మా" పెళ్ళికూతురు వెనక్కి తిరగబోయింది.

"నువ్వుండవే పిల్లా. నీకంతా ఆరాటమే. కాస్త ఆగు తీరుతుంది ఆరాటం..." అని ఆ పిల్ల మీద ముద్దుగా కోప్పడి బుగ్గమీద పొడిచింది సుందరమ్మ.

"ఆ అన్నట్లు అప్పుడేమయిందంటే, మా మామ్మ.. 'ఆ మంచం అచ్చొచ్చిన మంచం, దాని మీదనే శోభనాలు, ఆడపిల్లలవి, కోడళ్ళవి పురుళ్ళయ్యాయి. ఎన్నో శుభకార్యాలు చూసిన మంచం' అంటూ జడ్జీగారల్లే తీర్పు చెప్పేసరికి, బ్రిటిష్ మ్యూజియంలో పెట్టాల్సిన ఆ పట్టె మంచం గదిలోవేసి దానిమీద లావుగా రెండు పరుపులు వేసి అన్ని అమర్చి గదిలోకి పంపారు..." అని ఆగి ఆవిడేదో గుర్తొచ్చి తల్చుకుని తల్చుకుని నవ్వసాగింది. వింటున్న వాళ్ళకి కుతూహలంగా వుంది. ఇంకోళ్ళ శోభనం ముచ్చట్లంటే అందరికీ వినడానికి ఉత్సాహంగానే వుంటుంది.

"చెప్పు దొడ్డమ్మ తొందరగా" ఆడపిల్లలకు మహా క్యూరియాసిటీగా వుంది. ఆ రాత్రేం జరిగిందో తెల్సుకోవాలని ఆరాటం.

"ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పుకుని కాస్త కొత్త తీరి అలా మంచం మీద వాలామో లేదో, దాని దుంపతెగ, అసలే తాతలకాలం నాటి మంచం, దాని మీద మా ఇద్దరి భారీ విగ్రహాల బరువుకి అది కాస్తా ఫెళఫెళ విరిగి వూరుకుంది. దాంతో ఇద్దరం ధడాలున క్రింద పడ్డాము. ఆయనకాట్టే దెబ్బ తగల్లేదు కానీ, నాకే నడుం కలుక్కుమంది. ఈ శబ్దం విని బయట కాపు కాస్తున్న కొంతమంది అమ్మలక్కలు ఏం జరిగిందని అక్కడినించే అరిచారు. ఇద్దరం కిక్కురుమంటే ఒట్టు. ఆ తర్వాత ఇద్దరం కలిసి చప్పుడు కాకుండా ఆ మంచాన్ని ఎలాగో ఓ మూలకి జరిపి క్రింద పరుపేసుకుని పడుకుంటే, ఆ రాత్రి ఇంక నిద్రపోతే ఒట్టు..." అని క్షణం ఆగి నవ్వి ఇలా అంది. "పాపం ఆ రాత్రల్లా నా బెణికిన నడుం రుద్దటంతోనే తెల్లవారింది ఆయనకు... అందుకని ఓ పిల్లా ముందే చెప్తున్నాను. మంచం గట్టితనం ముందే పరీక్ష చేసుకుని ఎక్కండి. అందుకే అన్నారు శయనే హస్త తాడనం అని" అంటూ పెళ్ళికూతురి వీప్మీద ఒక్క చరుపు చరిచింది ఆవిడ.

అక్కడికి అప్పుడే వచ్చిన కృష్ణవేణికి సుందరమ్మ గారి చివరి మాటలు విన్నాక, తమ కాపురానికి వచ్చిన తొలిరోజులు తలపుకొచ్చాయి.

పెళ్ళయిన కొత్తలో కృష్ణవేణి, ఆనందరావు మొక్కు తీర్చుకోటానికి తిరుపతి వెళ్ళి అక్కడి హోటల్లో దిగినప్పుడు, ఆ హోటలు గదిలో మెత్తటి ఫోమ్ పరుపు మీద పడుకున్నప్పుడు, ఆ హాయి శరీరాన్ని పులకరింపజేస్తుంటే తొలిసారిగా అడిగింది కృష్ణవేణి "మనం కూడా ఇలాంటి మంచం, ఇలాంటి మెత్తని పరుపు కొనుక్కుందాము" అని.

"మీ నాన్న పండక్కి పిలుస్తాడుగా. అప్పుడు అలక పాన్పెక్కుతాను. ఇలాంటి మంచం, ఫోమ్‌పరుపు కొనిస్తే అలకమానాతానని చెప్పు. కొనిస్తాడు మీ నాన్న"

ఆ మాటకి కోపం వచ్చింది కృష్ణవేణికి. "సిగ్గు లేదూ అలా మాట్లాడ్డానికి? నేను, నా మొగుడు పడుకోటానికి డబుల్‌కాట్ మంచమూ, ఫోమ్ పరుపు కొనివ్వు నాన్నా అని నేను చెప్తానా?" అని ఇక ఆ రోజల్లా మాట్లాడలేదతనితో. అతను కొన్ని వందల సార్లు క్షమాపణలు చెప్పుకుని, వీలయినంత త్వరలో అలాంటి మంచం, ఫోమ్ పరుపు కొంటానని వాగ్దానం చేశాక అప్పటికి అలకమాని దారికొచ్చింది. బతిమాలక ఛస్తాడా? ఫోం పరుపు మీద దొరికే ఆనందం వదులుకునేంత వెర్రివాళ్ళా మగవాళ్ళు? కానీ వాళ్ళిద్దరికీ తెలీనిదొకటుంది. కొత్త మోజులో, వేడిలో ప్రతిదీ చేసేయగలమనుకుంటారు కానీ మధ్యతరగతి కొంపల్లో కోరికలు తీర్చుకోటమంటే కొండెక్కినంత గొప్ప.

ఈ నలభై సంవత్సరాల్లో పిల్లలు వరుసగా పుట్టటం, వాళ్ళ చదువులు, సంధ్యలు, బాధ్యతలు వరదల్లా చుట్టేసి, ఇదిగో ఇవాల్టికి ఒడ్డుకి తేలారు కృష్ణవేణి ఆనందరావులు.

"ఇదిగో ఇలారా" భర్త పిలుపు విని కూతురి కాపురానికి సారె సర్దుతున్న కృష్ణవేణి హాల్లోకొచ్చింది. అక్కడ అప్పుడే షోరూమ్ నించి తెప్పించి వేసిన డబుల్‌కాట్ మంచం, దాని మీద ఇంకా కవరు విప్పని ఫోం పరుపు పరిచి వుంది. అది చూడగానే సంతోషం



తో ఉక్కిరిబిక్కిరైంది క్షణకాలం కృష్ణవేణి. ఎంత ముద్దొస్తుందో మంచం నల్లటి డెకొలామ్‌తో నిగనిగ మెరుస్తూ.ఇకనించి మీ బరువు బాధ్యతలు నావి సుమా అంటూన్నట్టుంది. ఎన్నేళ్ళ తర్వాత తీరింది తన కోరిక. ఇక నించి తామిద్దరూ సుఖంగా...

"లోపల బెడ్‌రూమ్‌లో పెట్టించకపోయారా?" కళ్ళల్లో కోటి దీపాల కాంతులు మెరుస్తుంటే అన్నది.

"ఆ గదిలో చాలా సామాను చిందరవందరగా పడివుంది అదంతా సర్దాక, అక్కడ వేద్దాములే..." అని అతను ఇంకేదో అనబోతుంటే చిన్నకూతురు, అల్లుడు అప్పుడే బయటనుంచి వచ్చారు.

* * *

"కృష్ణే"

"వూ" అతనివైపు వత్తిగిలి అతని ఛాతీమీద చేతితో రాస్తూ అతని కళ్ళల్లోకి చూసింది ఏమిటన్నట్లు.

"అయామ్: వెరీ సారీ"

"దేనికి"

"నీ మాట వినివుంటే బాగుండేది. అందరూ వెళ్ళేవరకు ఆగవలసింది"

"పోన్లెండి. దాన్దేముంది. పిల్లల ఆనందం కంటే మన సుఖం ఎక్కువా? మీరు బాధపడకండి... మనకీ పాత నవారు మంచం రుణపడి వుంది. అందుకే మనల్ని ఇది వదలదు... దేవుడు మిమ్మల్ని చల్లగా చూస్తే అంతే చాలు... నాకింకే కోరికలు లేవు" అతని ఛాతీ మీద తలవాల్చి ఉబికివస్తున్న కన్నీటిని దాచేసుకుంది కృష్ణవేణి.

*